ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 9 ఆగస్టు 2025

ప్రేమానుబంధానికి ప్రతీక..

● నేడు రక్షా బంధన్.. నూలు పౌర్ణమి ● యజ్ఞోపవీతం.. పరమ పవిత్రం..
● జిల్లా కేంద్రంలో మార్కండేయ శోభాయాత్రకు సర్వం సిద్ధం



సిరిసిల్లలో రాఖీల విక్రయాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

'అమ్మ'లోని మొదటి అక్షరం.. 'నాన్న'లోని చివరి అక్షరం.. కలిపితే అన్న... అమ్మలోని ప్రేమ, నాన్నలోని బాధ్యతలతో సోదరికి భరోసా తోడుగా నిలుస్తాడు. వారి ప్రేమానుబంధానికి, సోదర ప్రేమకు రక్షగా రాఖీ పండుగ నిలుస్తుంది. శ్రావణ పౌర్ణిమ రోజున జరుపుకునే రక్షా బంధన్ రంగురంగు దారాలతో అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల మధ్య మమతానుబంధానికి ప్రతీకగా భావిస్తారు. ఒకప్పుడు రాఖీ పండుగ ఉత్తరాదిన ఎక్కువగా జరుపుకునే వారు. క్రమేణా రాఖీ పండుగ అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా మారి జాతీయ పండుగలాగా దేశంలోని అన్ని మారుమూల గ్రామాల్లో సైతం జరుపుకుంటున్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సోదరసోదరీ ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను జరుపుకుంటున్న వేళ జిల్లా కేంద్రంలో శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. నూలు పౌర్ణమి ఉత్సవాలను జరుపుకోనున్నారు. ఇందుకోసం ప్రధాన కూడళ్లను తోరణాలతో అలంకరించారు.

● రాఖీల కొనుగోళ్ల సందడి...

కుటుంబంలోని కష్టసుఖాల్లో తోడుండే అన్నదమ్ములే కాకుండా నేస్తాలంతా సోదరులుగా ఆడపడుచులు రాఖీలు కట్టే వేళయింది. శనివారం రాఖీ పండుగ కావడంతో దూరంగా ఉండే సోదరుల ఇళ్లకు ముందే వెళ్లారు. ఈ పండుగ కోసం విభిన్న డిజైన్లలో ఉన్న రాఖీల కొనుగోళ్లతో సిరిసిల్ల మార్కెట్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా సందడిగా మారింది. మార్కెట్లో చిన్నారులకు స్పైడర్‌మ్యాన్, చోటా భీమ్, బెన్‌టెన్, డోరెమాన్, జెర్రీ, హనుమాన్ లాంటి వెరైటీ కార్టూన్లు, యువత కోసం ఫ్యాన్సీ స్టోన్స్ రాఖీలు వచ్చాయి. జిల్లా కేంద్రంలో రాఖీల కోసం ప్రత్యేకమైన దుకాణాలు కూడా వెలిశాయి. పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్రల నుంచి వివిధ రకాల రాఖీలను తీసుకవచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. చిరువ్యాపారులు తోపుడు బండ్లపై రాఖీలను పెట్టుకొని కార్మిక వాడల్లో సైతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఈసారి రాఖీలు అనేక డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. రుద్రక్ష, స్టోన్ రాఖీలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. కుందన్‌ల మెరుపులు, జరీతోపాటు స్పాంజ్‌తో తయారు చేసిన రాఖీలు మార్కెట్లోకి వచ్చాయి. పాతకాలంలో అతిపెద్దగా ఉండే రాఖీలు కట్టుకునే వారు. మళ్లీ ఆ ట్రెండ్ వచ్చింది. మార్కెట్లో రూ.50 నుంచి రూ.100 విలువచేసే పెద్ద రాఖీలు అమ్మకాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లలను ఆకర్షించే విధంగా 10 రూపాయల నుంచి 30 రూపాయల వరకు క్రికెట్, మిక్కీమౌస్, స్పైడర్ మ్యాన్, డిజైన్లలో కూడా రాఖీలు వచ్చాయి. స్టోన్ రాఖీలు రూ 25నుంచి రూ 300ల వరకు లభిస్తున్నాయి. 1 గ్రాముతో తయారు చేసిన రాఖీలు కూడా మార్కెట్లో లభిస్తున్నాయి.

పండుగ నేపథ్యం..

క్రీస్తుపూర్వం 326లో అలెగ్జాండర్ భారతదేశంలోని పురుషోత్తముడి రాజ్యంపై దండెత్తాడు.ఆ సమయంలో అలెగ్జాండర్ ప్రేయసి రుక్సానా పురుషోత్తముడికి రక్షాబంధన్ కడుతుంది. ఆ కంకణానికి విలువనిచ్చిన పురుషోత్తముడు యుద్ధంలో చేతికి చిక్కిన అలెగ్జాండర్‌ను ప్రాణాలతో వదిలేస్తాడు. ఆ తరువాత పురుషోత్తముడిని అలెగ్జాండర్ బంధిస్తాడు. ఆ తరువాత సభా భవనంలో పురుషోత్తముడు బెదురులేకుండా ఒక రాజు మరో రాజును ఎలా గౌరవిస్తారో అలాగే అంటూ రుక్సానా కట్టిన రక్షాబంధనంతోనే తాను ప్రాణాలతో ఉన్నానని తెలుసుకున్న అలెగ్జాండర్ పురుషోత్తమున్ని కీర్తించి వదిలేస్తాడు. మరో చారిత్రక కథనం ప్రకారం దేవతలు, రాక్షసుల మధ్య యుద్ధం జరిగినప్పుడు దేవతలకు నిస్సత్తువ ఆవహిస్తుంది. ఇంద్రుని భార్య శశిదేవి బృహస్పతి సలహా మేరకు ఒక రక్షణు ఇంద్రునికి కడుతుంది. ఆ యుద్ధంలో ఇంద్రుడు రాక్షసుల్ని ఓడిస్తాడు. అలా పౌర్ణమి రోజు రక్షగా చేతికి తోరం కట్టుకోవడం ఆచారంగా మారిందని చెప్పుకుంటారు. రాజపుత్రులు దీనికి ఎంతో ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుంది. మరోవైపు మనుషుల్లో ప్రేమ, ఆప్యాయత, మమతను పెంచడం కోసం

- మిగతా 8లో

అందుబాటులో రైతులకు సరిపడా ఎరువులు..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..



అపేరల్ పార్క్‌లో ఎరువుల గోదాంను ప్రారంభిస్తున్న స్వరూపతిరుపతిరెడ్డి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల నిల్వ కోసం ప్రత్యేకంగా గోదాంను ఏర్పాటుచేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపేరల్‌పార్క్‌లో వంద మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల ఎరువుల గోదాంను శుక్రవారం సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌తో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎప్పుడైనా, ఎక్కడైనా అత్యవసర పరిస్థితుల్లో ఎరువుల కొరత ఏర్పడినప్పుడు అందజేసేందుకు ఈ గోదాంను ఏర్పాటు చేశామన్నారు. వంద మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్‌లో అందుబాటులో పెడుతామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం మాట్లాడుతూ జిల్లాకు అవసరమైన ఎరువులు గతంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి మాత్రమే తెప్పిస్తున్నామని అన్నారు. అత్యవసర సమయంలో ఎరువులు కావాల్సి వస్తే ఇబ్బందులు ఎదురయ్యేవని గుర్తుచేశారు. ఈ ఇబ్బందులు అన్నింటిని దూరం చేసేందుకు కలెక్టర్ ఈ గోదాంను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా



మొక్కల కుండీని పరిశీలిస్తున్న కమిషనర్ ఖాదీర్ పాషా

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దోమల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖదీర్ పాషా అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం 17వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వార్డులోని డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. మురుగు కాలువలు, గృహ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల ప్రభావంతో అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. దోమలద్వారా రోగాలు వ్యాప్తిచెందకుండా భద్రత నియామాలను పాటించాలని ఇంటి పరిసరాలతో పాటు ఇంట్లో కూడా పరిశుభ్రతను పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ ఎడ్ల శేఖర్, వార్డు ఆర్పీలు, మేఘన, మమత, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశ కార్యకర్తలు శ్రీవాణి, మమత, వార్డు జవాన్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఎండగట్టి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, అల్మాస్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకు ప్రతి నాయకులు, కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆగయ్య సూచించారు. ఈ సమావేశంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు నర్సింహారెడ్డి, శరవింద్, బాబు, గోపాల్, శంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ప్రయాణీకుల, ట్రాలీ ఆటో డ్రైవర్లకు శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్ ఆటోలు నడిపించే డ్రైవర్లు విద్యార్థుల భద్రతే లక్ష్యంగా వాహనాలను నడిపించాలన్నారు. వెహికిల్స్ చట్టంలోని నిబంధనలు, అధిక లోడ్‌తో ప్రయాణికులను ఎక్కించడం నిషేధమన్నారు. ప్రమాదాలను నివారించడానికి జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరమని, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని డ్రైవర్లకు సూచించారు. స్కూల్ ఆటోల్లో విద్యార్థుల సంఖ్యను పరిమితికంటే ఎక్కువగా ఎక్కించరాదన్నారు. ప్రయాణంలో అజాగ్రత్తగా ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించాలి



ఈటల రాజేందర్‌ను కలిసిన నిర్వాసితులు

బోయినిపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మిడ్‌మానేరు నిర్వాసితులు పెండింగ్ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం నిర్వాసిత యువతకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వలేదని, కొంతమంది నిర్వాసితులకు ఇళ్ల పరిహారం రావలసి ఉందన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి కృషిచేయాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, సెంచు నాగరాజు, మోహన్‌బాబు ఉన్నారు.

బీసీ హాస్టల్‌ను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ ఆందోళన



బీసీ హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గంబీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గంబీరావుపేటలో మూతపడ్డ బీసీ హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. చాలా సంవత్సరాలుగా బీసీ హాస్టల్ భవనం పూర్తిగా మూసివేశారని కళ్యాణ్‌కుమార్ పేర్కొన్నారు. కేజీ టూ పీజీకి దూరప్రాంతం నుంచి చదువుకోటానికి వచ్చే విద్యార్థులు హాస్టల్‌వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. సత్వరమే బీసీ హాస్టల్‌ను పునర్నిర్మాణం చేపట్టి హాస్టల్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని కళ్యాణ్‌కుమార్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఇన్‌చార్జీ అరుణ్, నాయకులు సిద్ధు, యశ్వంత్, మనీశాంత్, అభిషేక్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలి

- సూచనలు, సలహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు విస్తరణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంతోపాటు పంట సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయిల్‌పామ్ పంటల సాగు, లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశ అవసరాలకు సరిపడా వంట నూనె మన దగ్గర పండటం లేదని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల దేశానికి కోట్లలో నష్టం వస్తోందన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగడం వల్ల రైతులకు అధిక లాభం జరగడంతో పాటు దేశానికి కూడా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. ఆయిల్‌పామ్ పంట సాగు విస్తరణ కోసం ప్రభుత్వం అనేక సబ్సిడీలను అందిస్తోందని, రైతులకు అంతర్ పంటల ద్వారా మొదటి మూడు సంవత్సరాలు ఆదాయం లభిస్తుందన్నారు. మొక్కలు, డ్రిప్ అంతర్ పంటలపై నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం దాదాపు ఎకరానికి రూ.52వేలు సబ్సీడీ విడుదల చేస్తుందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 2వేల ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగు విస్తీరణ లక్ష్యం కాగా ఇప్పటివరకు 1135 ఎకరాల గల 322 మంది రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగుకు ఆసక్తి చూపించారని, 99 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల రిజిస్ట్రేషన్ పరిపాలన మంజూరు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి చూపుతున్న రైతుల వద్ద నుంచి మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు రైతుల వాటా డీడీలను సేకరించి సంబంధిత ఏజెన్సీల ద్వారా డ్రిప్ సౌకర్యం సత్వరమే అందేలా చూడాలని నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని వివరించారు. 2022 సంవత్సరంలో బోయిన్‌పల్లి, ఇల్లంతకుంట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లో 292 మంది రైతులు 978 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను సాగు చేయగా, ఈ సంవత్సరం 450 టన్నుల వరకు ఆయిల్‌పామ్ గెలలు రావచ్చని అన్నారు. ఇప్పటి వరకు 14 టన్నుల హార్వెస్టింగ్ చేశారని, టన్నుకు రూ.18వేల ధర లభించిందన్నారు. పంట దిగుబడి వస్తున్న రైతుల అనుభవాలను కొత్త రైతులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. లాభసాటి ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఆయిల్‌పామ్ పంటలకు సంబంధించి రైతులు సలహాలు, సూచనల కోసం టోల్ ఫ్రీ నంబర్ 9398684240 ఫోన్ చేయాలని కోరారు. పంటల లాభంపై అధిక ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి లత, అధికారులు గోవర్ధన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోని వారు ఇప్పుడు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని అన్నారు. ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 125 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తుండటంతో ప్రజల్లో ఆదరణ లభిస్తుందన్నారు. దీనిని చూసి తట్టుకోలేని కొంతమంది నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో కనీసం సీఎం సహాయనిధి అందడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 18నెలల్లో 18విడతలుగా సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశామన్నారు. మానకొండూర్ క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి దరఖాస్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు తీగల పుష్పలత, చిట్టి ఆనందరెడ్డి, ప్రసాద్, ఎర్రోజు సంతోష్‌కుమార్, మామిడి రాజు, కూనబోయిన బాలరాజు, ఉస్మాన్, రేగుల కార్తీక్, మంద పెద్దబాల్‌రెడ్డి, కాథ మల్లేశం, యాస తిరుపతి, కాసుపాక సురేష్, బెజ్జంకి శ్రీనివాస్, గూడ బాబు, దయాసాగర్, రవిలతో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో పిచ్చిమొక్కల తొలగింపు

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పంచాయతీ కార్మికుడు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగిపోయాయి. తరగతి గదులు, ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఈనెల 8న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పాఠశాలలో పొంచి ఉన్న ప్రమాదం' కథనానికి పంచాయతీ కార్యదర్శి సంపత్ శుక్రవారం స్పందించారు. పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లను పరిశీలించారు. పంచాయతీ కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగించారు. మరుగుదొడ్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. కోతులు, పాడి గేదెలు రాకుండా నివారణ చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. బడిలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పారిశుధ్య పనులు చేయడంపై పలువు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, THALLAPALLY GANESH, S/O BAKKANNA, R/O, H.NO : 4-43, THAKKALLAPALLE, KATHALAPUR, JAGITYAL DISTRICT. HAVE CHANGED MY NAME AS "THALLAPALLI GANESH", S/O. BAKKANNA.

AJK-17114

ప్లాట్లు - పెళ్లి సంబంధాలు - లోన్స్

★ పిల్లల భవిష్యత్తుకై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 5L 150 చ.గల ప్లాట్లు కొండగట్టు, వేములవాడలో కలవు. వ్యవసాయ భూములు అమ్మే/కొనేవారు సంప్ర : పెళ్ళి సంబంధాలు, NRI సాఫ్ట్‌వేర్ 1వ, 2వ సంబంధాలు చూడబడును. ప్రాపర్టీ లోన్స్ ప్రై & Govt బ్యాంకులలో ఇప్పించబడును. జ్యోత్స్న రెడ్డి. సెల్ : 78937 27274

AJK-17113

3+2 స్కీం కలదు

పాస్‌పోర్ట్ పోయినది

★ వడ్డె మనోహర్ రెడ్డి తండ్రి : సుధాకర్ రెడ్డి నా యొక్క పాస్‌పోర్ట్ నెం.S3403300 కరీంనగర్ గోదాంగడ్డ నుండి భగత్‌నగర్‌కు ఇల్లు షిఫ్ట్ చేస్తుండగా పోయింది. ఎవరైనా దొరికినవారు అప్పగించగలరు. సంప్ర: సెల్ : 91820 59777

AJK-

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక.. యువతి బలవన్మరణం


సంధ్య మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చొప్పదండి పట్టణానికి చెందిన వనపర్తి సంధ్య(27) కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. వారం క్రితం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 14న వివాహం జరగాల్సి ఉంది. వివాహం కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లిపనుల్లో భాగంగా యువతి తల్లిదండ్రులు పెళ్లి కార్డులను పంచేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో సంధ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కార్డులు పంపిణీ చేసి శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి సంధ్య మృతిచెంది ఉంది. తండ్రి కనుకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శ్రీరాములపల్లె రోడ్డు కట్ట వద్ద ఉడుత తిరుపతి(45) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ప్రతి రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 7వ తేదిన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం శ్రీరాములపల్లె రోడ్ కట్టవద్ద తిరుపతి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమార్తె రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పొలంలో వరి నారు గుంజుతూ కూలీ మృతి

సైదాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి అనిల్(35) అనే కూలీ వరి నారు గుంజుతూ పొలంలోనే పడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అనిల్ అదే గ్రామానికి చెందిన గుర్రాల మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలో నారు గుంజేందుకు వెళ్లాడు. నారు గుంజుతూ అకస్మాత్తుగా పొలంలో పడి పోయాడు. నాటు వేసేవారు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. దీంతో వెంటనేవారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. తనకుమారుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధరకు చెందిన రాజుల యాదయ్య(50) దుర్మరణం చెందగా, గంగాధర వేణు తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదయ్య, వేణు ద్విచక్రవాహనంపై కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్‌కు వచ్చి తిరిగి గంగాధరకు బయల్దేరారు. కొత్తపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా బైక్‌ను ఢీకొని మరో కారును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుకకూర్చున్న యాదయ్య రెండువాహనాల మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. వేణుకు గాయాలయ్యాయి. యాదయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన వేణును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైసాంబమూర్తి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. యాదయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

● రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగ్రాతుడిని మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కాళ్ల పారాణి ఆరక ముందే కానరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి
● భర్తకు గాయాలు
● పీజీ ఎంట్రెన్స్ పరీక్షరాసి వెళుతుండగా ఘటన



ఈ చిత్రంలో చిరునవ్వులు చిందిస్తోన్న వధువు పేరు ముద్దసాని అఖిల.. చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన ఆమె వివాహం ఈ నెల 6న జగిత్యాల జిల్లా లొత్తునూరుకు చెందిన రాజుతో జరిగింది. కోటి ఆశలతో వివాహ బంధంలోకి వెళ్లిన ఆమెను మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పీజీ ఎంట్రెన్స్ రాసి భర్తతో కలిసి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ వెనక నుంచి ఢీకొంది. రోడ్డుపై పడ్డ అఖిలను ఆ లారీ తొక్కుకుంటూ వెళ్లడంతో ఆమె తల నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రాజు కాస్త పక్కకు పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

తిమ్మాపూర్/చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నవ వధువు.. కాళ్ల పారాణి ఆరకముందే కానరాని లోకాలకు వెళ్లి పోయింది. 22ఏళ్లకే నిండు నూరేళ్ల నిండాయి. పెళ్లైన రెండు రోజులు కూడా గడవక ముందే ఆమె రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించింది. ఈ సంఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని లత-నర్సయ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ముద్దసాని అఖిల (22) వివాహాన్ని ఈ నెల 6న వెల్గటూరు మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన రాజుతో ఘనంగా జరిపించారు. అదే రోజు నూతన వధూవరులు లొత్తునూర్‌కు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం రుక్మాపూర్‌కు వచ్చారు. అఖిలకు పీజీసెట్ ప్రవేశపరీక్ష కోసం ద్విచక్ర వాహనంపై తిమ్మాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది.


అఖిల (ఫైల్)

దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నవదంపతులు రాజు, అఖిల కింద పడిపోయారు. లారీ వేగంగా అఖిల తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాజు స్వల్పగాయాలతో బయట పడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది ప్రమాదానికి కారణ మైన లారీని పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసు కున్నారు. మృతురాలు అఖిల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అఖిల మృతదేహం

వచ్చాక నల్లపూసలు గుచ్చుకుంటానని చెప్పి వెళ్లి..

పరీక్ష పూర్తయిన వెంటనే రుక్మాపూర్‌కు వచ్చి పెళ్లితంతు కార్యక్రమంలో (నల్లపూసలు గుచ్చుకోవడం) పాల్గొంటామని చెప్పి ఇద్దరూ వెళ్లారు. కూతురు కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు మరణవార్త వినిపించడంతో కుప్పకూలిపోయారు. ఎంతో సంతోషంగా కూతురు అల్లున్ని చూసి మురిసిపోయిన వారి కుటుంబంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. కూతురు వివాహాన్ని ఘనంగా జరిపించామన్న సంతోషం ఆ కుటుంబంలో ఒక్కరోజు కూడా నిల్వలేదు. పెళ్లి తంతు కార్యక్రమం అనంతరం తమ్ముడికి రాఖీ కడతానని చెప్పి వెళ్లిన అఖిల తిరిగి రానిలోకాలకు వెళ్లడంతో తమ్ముడు తల్లడిల్లిపోయాడు. అఖిల మృతి రుక్మాపూర్‌తో పాటు లొత్తునూర్‌లో విషాదం నింపింది.

సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సావనపెల్లి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోషల్‌మీడియాలో మీడియాలో పోస్టులు పెట్టిన ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఇల్లంతకుంటకు చెందిన సాదుల్ తనని అవమానించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని, అదే విధంగా నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త రాజు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మీద అసభ్యకరంగా మార్ఫింగ్ వీడియోలు పెట్టాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో అభ్యంతరకరంగా పోస్టులు ఎవరు పెట్టవద్దన్నారు. ఇతరుల మనోభావాలు కించపర్చేలా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ

మల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని ప్రాథమికపాఠశాల వంట గది తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్‌ను అపహరించుకెళ్లినట్లు బాధిత ఆయా మహ్మద్‌రజియా శుక్రవారం వాపోయింది. మధ్యాహ్నభోజనం అనంతరం గురువారం వంటగదికి తాళంవేసి శుక్ర వారం వచ్చిచూడగా సిలిండర్ లేదన్నారు. మొగిలిపేట గ్రామంలో ఇటీవల వరుసగా సిలిండర్ల చోరీకి గురవుతున్నాయని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సినగ్రామస్థులు కోరుతున్నారు.

ఫేక్ ఫేస్ రికగ్నిషన్ వ్యవహారంలో.. మరో నలుగురు కార్యదర్శులపై వేటు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఫేక్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటుపడింది. శుక్రవారం జిల్లాలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ, ఒక పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఫేక్‌ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో సంబంధితయాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోను అప్‌లోడ్ చేసిన బుగ్గారం మండలం చందాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్, ఇరవై మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. జూలైలో 24పని దినాలకు గాను 20పనిదినాల వరకు ఫేక్ ఫేస్‌రికగ్నిషన్ అటెండెన్స్‌కు పాల్పడిన నలుగురు కార్యదర్శులపై అధికారులు వేటు వేశారు. బుగ్గారంమండలం గోపులాపూర్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్‌మండలం రేకులపల్లి, మల్యాల మండలం రాజారం, ధర్మపురి మండలం నాగారంపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితోపాటు మరో17మంది పంచాయతీ కార్యాదర్శులకు వేతనాల్లో కోతవిధిస్తూ ఉత్తర్వులుజారీ అయ్యాయి. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా పంచాయతీఅధికారి మదన్‌మోహన్ తెలిపారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలో కిడ్నాప్ కేసుకు సంబంధించి నిందితుడిని కొత్తపల్లి శివారులో రాజస్థాన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కోసం రాజస్థాన్ పోలీసులు వెతుకుతున్నారు. నిందితుడు హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుడిని రాజస్థాన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండపాక గ్రామానికి చెందిన నాగుల రాజు, అవాల గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.16.500నగదు, 7బైక్‌లు, 8సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కార్లు కిరాయికి పెడతానంటూ నమ్మించి మోసం

● మరొకరి దగ్గర కుదువ పెట్టి లక్షల్లో అప్పు ● నిందితుడి అరెస్టు, నాలుగు కార్లు, సెల్‌ఫోన్ సీజ్


స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో ఏసీపీ రమేష్, అధికారులు

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు లబ్ధిదారులు, ఇతర కారు యజమానుల వద్ద తాను కార్లు అద్దెకు పెట్టించి నెలానెలా కిరాయి ఇప్పిస్తానంటూ నమ్మించి యజమానులకు తెలియకుండా కార్లు కుదువ పెట్టుకున్న గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన మారుపెల్లి ప్రణయ్ భాస్కర్(29) అనేవ్యక్తిని శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు గోదావరిఖని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన బోడ తిరుపతి, శ్రీనగర్‌కాలనీకి చెందిన కాసర్ల మేఘమాల, ఇల్లంతకుంట మండలం వంతడుపులకు చెందిన సప్పి కుమార్, సప్పి మొగిలిల నుంచి తాను కార్లు అద్దెకు పెట్టిస్తానంటూ మారుపెల్లి ప్రణయ్ భాస్కర్ అనే కారు డ్రైవర్ కొన్ని నెలల క్రితం కార్లను తీసుకెళ్లాడు. ఈ కార్లను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో అద్దెకు పెట్టానంటూ నమ్మించాడు. ఒకటి రెండు నెలలు అద్దె కూడా ఇచ్చాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రణయ్ భాస్కర్ ఈ కార్లను కొందరి వద్ద తనఖా పెట్టి కారుకు రెండు మూడు లక్షల చొప్పున రూ.10లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. యజమానులు ఫోన్ చేస్తే స్పందించకుండా హైదరాబాద్‌కు పరారై తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనికి సోదరి జూపాక పుష్పలత, సప్తగిరి కాలనీకి చెందిన వనం శ్రీనివాస్ సహకరించారు. బాధితుడు బోడ తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసుకుని నాలుగు కార్లు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఎవరైనా వాహనాలను తనఖా పెట్టుకునే ముందు పూర్తివివరాలను తెలుసుకోవాలన్నారు. ఇలాంటి వాహనాలు తనఖా పెట్టుకుంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రణయ్ భాస్కర్ బాధితులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ఇంద్రసేనారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, సదానందం, ఏలియా, కానిస్టేబుల్ మధుకర్, రమేష్‌లను ఏసీపీ అభినందించారు.

జోరుగా మట్టి దందా

● ప్రభుత్వ భూములే లక్ష్యం
● అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

జూలపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమరవాణా జోరుగా సాగుతోంది. మట్టి మాఫియాకు రాజకీయ పలుకుబడి తోడవడంతో అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. మండలంలోని చీమలపేట గ్రామశివారులోని దామెరచెరువుకు అతి సమీపంలో గల గుట్టబోరు మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వుతూ టిప్పర్ల ద్వారా నాలుగురోజులుగా మట్టిని ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు గురువారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టిని తరలిస్తున్న విషయమై మైనింగ్ అధికారులకు శుక్రవారం చేశారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుట్టబోరు మట్టిని తొలగించడం వల్లా దామెర చెరువులో నీరు నిలువక ఎడారిగా మారే ప్రమాదం ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. అంతే కాకుండా కొందరు మట్టిమాఫియా కేటుగాళ్లు గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో చెట్లను నరికి వేయడమే కాకుండా చెట్లకర్రలను, మట్టిని అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని చెపుతున్నారు. మట్టిని తొలగించిన భూమిని సాగుకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ విషయమై జిల్లామైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా దామెరచెరువు పక్కన మట్టిని తొలగించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. రోడ్డునిర్మాణాలకు మట్టి తరలిస్తే ఆపనుల నుంచి ప్రభుత్వానికి సొమ్ము జమచేయబడుతుందని పేర్కొన్నారు. అక్కడి ప్రదేశాన్ని పరిశీలించి తదుపరిచర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు రూరల్ మండలంలో కొన్ని రోజులుగా ఇళ్లముందు నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్న పడాల దినేష్ అనే నిందితుడిని జగిత్యాలపట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. పట్టణపోలీసులు శుక్రవారం ఎస్‌కేఎన్ఆర్ కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల దినేష్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. విచారణలో ద్విచక్రవాహనాల దొంగగా గుర్తించామన్నారు. దినేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడి వద్ద 9 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సైలు సుప్రియ, రవి కిరణ్, కుమారస్వామి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కొరడా

● ఇసుక డంప్‌ల సీజ్
● జల్లెడ పడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు
● 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కొరడా ఝుళిపించారు. ఇసుక మాఫియా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, పోలీస్, మైనింగ్ విభాగాల అధికారులతో తనిఖీ చేయించారు. వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. రామగుండం అర్బన్ పరిధిలోని పాములపేట, మేడిపల్లి ఇసుక రీచ్‌లను మూసివేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రామగుండం మండల పరిధిలోని ఎఫ్‌సీఐ, సంజయ్‌గాంధీనగర్, గోదావరిఖని సప్తగిరికాలనీ, జనగామలో ఇసుకరీచ్‌లను సీజ్‌చేశారు. 190ట్రాక్టర్ ట్రిప్పులను స్వాధీనం చేసుకున్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బెంద్రం రాజిరెడ్డి, సప్తగిరికాలనీకి చెందిన గుంపుల ఓదెలు, మరికొంత మందిపై 303/2బీఎన్ఎస్, 21ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం అర్బన్ పరిధిలోని ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు విస్తృత తనిఖీలు జరిపారు. ఏసీపీ రమేష్ సారథ్యం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు రమేష్, భూమేష్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పలు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. మూసివేసిన పాములపేట, మేడిపల్లి క్వారీలకు ట్రాక్టర్లు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు కందకాలు తీశారు. శుక్రవారం ఎన్‌టీపీసీ పీటీఎస్ సమీపంలోని ఇసుక డంప్‌ను సీజ్‌చేశామని, అలాగే జనగామలో మరో డంప్‌ను సీజ్ చేసినట్టు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం మండల పరిధిలోని ఇసుక రీచ్‌లను నిషేధించామని, ఇక నుంచి ఎవరైనా గోదావరినదిలోకి ట్రాక్టర్లను దించి ఇసుకను తీసుకువచ్చినా, డంప్ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

● దూషించినందుకే తలపై మోది హత్య


మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మెన్నేని ప్రేమలత అనే వృద్ధురాలి హత్య కేసులో నిందితుడైన నాచుపల్లి గ్రామానికి చెందిన సురభి రఘునందన్‌రావును శుక్రవారం అరెస్టుచేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రేమలత రఘునందన్‌రావుకు వరుసకు అత్తమ్మ అవుతుంది. నిందితుడు కనిపించినప్పుడల్లా ప్రేమలత బూతులుతిట్టేది. దీంతో ఆమెపై రఘునందన్‌రావు కోపం పెంచుకున్నాడు. గతసంవత్సరం ప్రేమలతకు, నిందితుడికి మధ్య గొడవ జరగ్గా పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పారు. బుధవారం రాత్రి వృద్ధురాలు ఊరినుంచి ఇంటికివెళ్తుండగా రఘునందన్ రావును చూసి దూషించింది. దీంతో ప్రేమలతను అక్కడే ఉన్న కర్రతో తలపై కొట్టి బండరాయితో బాదడంతో ఆమె మృతి చెందింది. అనంతరం మృతురాలి ఇంటి ముందు ఉన్న నీరు లేని బావిలో పడవేశాడు. నిందితుడికోసం గాలించి శుక్రవారం ఉదయం దొంగలమర్రి సమీపంలోపట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల, ఎస్సై సందీప్ ఉన్నారు.

ఉపాధిహామీలో ఈకేవైసీ విధానం

● అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
● ఈ నెల 15 నుంచి అమలు


ముఖచిత్రం ద్వారా హాజరు తీసుకుంటున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈకేవైసీ విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో నకిలీ ఫొటోల అప్‌లోడ్‌కు అడ్డుకట్ట పడనుంది. ఉపాధిహామీ పనుల కోసం వచ్చిన కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు రెండు సార్లు ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ముందుగా పనులకు వచ్చిన వెంటనే ఒకసారి, నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీస్తారు. ఈ రెండు ఫొటోల్లో కూలీలు ఒకేలా ఉంటేనే వేతనాలు మంజూరవుతాయి. తేడా ఉంటే వేతనాలు నిలిపివేస్తారు. ఆగస్టు 15 నుంచి ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ పనుల్లో ఒకరికి బదులు మరొకరు వెళ్లి వేతనాలు పొందినట్లు అనేక సామాజిక తనిఖీల్లో బయటపడింది. కొన్ని సందర్భాల్లో నిధులను రికవరీ కూడా చేశారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు హాజరు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్ (ఎన్ఎంఎంఎస్)ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కొత్త విధానానికి చర్యలు చేపట్టారు. గతంలోకూలీలు పని చేయకున్నా క్షేత్ర సహాయకులు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. ఈ విధానంతో నకిలీ హాజరు అవకాశం ఉండకపోగా వేతనాల చెల్లింపులోనూ పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంది.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

మంథనిరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ శివారులోని మల్లయ్య ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తరలించడానికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. గోదావరినది నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇటుకల బట్టీకి తరలించి అక్కడినుంచి జేసీబీ సహాయంతో రెండు టిప్పర్లలో ఇసుకను జగిత్యాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. జేసీబీ, టిప్పర్లను, ఇసుక డంప్ సీజ్‌చేసి వాసం సతీష్, ముస్కే రాజుకుమార్, ఎర్రం సంతోష్, తనుగుల మహేష్, తన్నీరు మల్లిఖార్జున్, పొట్ల రాజ్‌కుమార్, పొయ్యాల భాస్కర్, పిక్కల మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



చెట్లకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలలో వృక్ష రక్షా బంధన్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వినూత్నంగా చేపట్టిన వృక్ష రక్షా బంధన్‌కు విద్యార్థినుల నుంచి స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా పని చేసిన ప్రమోద ఆలోచనలతో 16 సంవత్స రాలుగా కార్యక్రమం కొనసాగుతోంది. నీతూకుమారి కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో ఆమె ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమోద మాట్లాడుతూ వృక్షాన్ని అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టి రక్షిస్తే నీడను, ఆక్సిజన్, ఆహారాన్ని అందిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో సందడిగా మా రింది. భక్తులు ప్రవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకు న్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనడంతో బాంబ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ప్రాంగణంలో, ఆవరణతో పాటు పలు విభా గాల్లో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్క రించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడా కావడంతో అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉపావాస దీక్షతో ఉన్న మహి ళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్ అమ్మ వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిం చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగ శాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారలతో పాటు లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీం దర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ పాల్గొన్నారు.



గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ఆదివాసీ జీవన చిత్రాలు

- ఫొటోగ్రఫీలో సిగ్మా శేఖర్ అంతర్జాతీయ ఖ్యాతి
- వెయ్యికు పైగా అవార్డులు.. 100 అంతర్జాతీయ అవార్డులు..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)





అడవితోనే జీవనం, ప్రత్యేకమైన వస్త్రధారణ, అటవీ సంపద, పోడు వ్యవసాయం జీవనాధారంగా మానవ జాతికి అనవాళ్లుగా ఆదివాసీలు, గిరిజనులు జీవనం సాగి స్తున్నారు. అమాయకత్వమే వారి అభరణం.. మూగ జీవా లు వారి నేస్తాలుగా ఇంకా అనేక ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. అడవుల్లో వాగులు, కొండలు, పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వీడకుం డా జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనుల బతుకు చిత్రా లను తన కెమెరాలో బంధించిన సిరి సిల్లకు చెందిన అంత ర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్‌పై శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





ఆదివాసీ, గిరిజనుల బతుకు చిత్రాలు..

దేశంలోని వివిధ ప్రాం తాల్లో ఆదివాసీ, గిరిజను ల జీవన శైలిని, వారి బతు కు చిత్రాలను కెమెరాలో బంధిస్తూ ఫొటోగ్ర ఫీ రంగంలో శేఖర్ అం తర్జాతీ య స్థాయి లో ఎన్నో అవా ర్డులను అందుకు న్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటోస్టూడియోతో ఛాయాచిత్ర రంగంలో అడుగుపెట్టిన మేర్గు శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను అందుకోవ డంతోపాటు పలు దేశాల్లో ఫొటోప్రదర్శనలు నిర్వహించారు. సిగ్మా పేరే శేఖర్‌కు సిరిసిల్లలో ఇంటి పేరుగా మారిపోయింది.

ఇప్పుడు సిగ్మా అకాడమి స్థాపించి ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తూ వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ఫొటోగ్రఫీ రంగంలో 1992 నుంచి 2024 వరకు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. 1000కి పైగా అవార్డులు, 100 అంతర్జాతీయ పుర స్కారాలను, 300 మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకున్నారు. సిగ్మా ద్వారా 200 పైగా వర్క్ షాప్‌లు నిర్వహించారు. ఢిల్లీ నగ రంతో పాటు అనేక ప్రాంతాల్లో శేఖర్ విభి న్నంగా తీసిన దాదాపు 1650 ఫొటోలతో ఎగ్జిబిషన్లు నిర్వహించారు.



శేఖర్ (ఫైల్)

పత్తిలో కలుపు మందు పిచికారికి ప్రత్యేక ఏర్పాట్లు

పాలకుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలోని రైతులు పత్తిలో కలుపు మందు పిచికారి చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విధానంతో పత్తి మొక్కలపై కలుపు మందు పడకుండా కలుపు మొక్కల నివారణ జరుగుతుందని ఏఈవో శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక పరికరం వాడు తున్న రైతులతో మాట్లాడుతూ పత్తి విత్తిన 20 నుంచి 60 రోజుల వరకు చేను లో కలుపు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగళ్లతో గాని, కూలీల సహాయంతోగాని 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకున్నట్లయితే పత్తి ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరంతో పత్తి మొక్కలపై గడ్డి మందు పడకుండా పిచికారీ చేసుకోవచ్చ న్నారు. కలుపు ఉండడం వల్ల పత్తి మొక్క లకు వేసిన రసాయన ఎరువులు ఆ మొక్క లకే పోతాయన్నారు. రైతులు సట్ల కనుక య్య, సముద్రాల పోచయ్య, మొం డయ్య, సాయిలు, బాదావత్ తిరుపతి పాల్గొన్నారు.



ప్రత్యేక పరికరంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శశిధర్

సిట్ విచారణకు హాజరైన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు సిట్ విచారణకు హాజరవుతున్న పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచార ణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లా డుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ నిమిత్తం పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభు త్వం తన ఫోన్ ట్యాప్ చేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి సాగ దీస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిపించే విడిచి పేట్టేది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ముగిసాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడా కారులు ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. టీఎం ఈవెంట్ అండర్-14 విభాగంలో వీపీఎస్ పబ్లిక్ స్కూలు (విజయవాడ) ప్రథమ స్థానం, టైం స్కూలు(రంగారెడ్డి) ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ స్కూల్ (తూర్పు గోదావరి) ప్రథమస్థానం, సర్ సీఆర్ స్కూల్(పెద్దాపురం, పశ్చిమ గోదావరి) ద్వితీయ స్థానం, అండర్-19 విభాగంలో శ్రీప్రకాశ్ స్కూలు (తూర్పుగోదావరి)ప్రథమస్థానం, సర్ సీఆర్ రెడ్డి స్కూల్ (పెద్దాపురం, పశ్చిమగోదావరి) ద్వితీయ స్థానాలు సాధించాయి.

వ్యక్తిగత విభాగంలో అండర్-14లో శీలం మనస్వి ప్రథమ స్థానం, అండర్-17 విభాగంలో ఎం. శాంతిజ్యోతి ప్రథమ, అండర్-19 విభాగం లో ఎం.దర్శిక ప్రథమ స్థానం సాధించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభి వృద్ధి లభిస్తుందన్నారు. క్రీడలు ఒత్తిడి నుంచి తట్టుకునే శక్తిని అంది స్తాయన్నారు. క్రీడల్లో రాణించినవారు, చదువులోనూ ముందుంటా రన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పద్మారావు, చీఫ్ రెఫరీ శంకర్, అసోసియేట్ రెఫరీ రాంచంద్రారావు, అంపైర్లు బాబు రావు, ఒతినేలు, ఎండీ గౌస్, రామ్మూర్తి, రవి, గంగారాం, పాఠశాలల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలతో అతిథులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో గెలు పొం దిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎస్.మనస్వి, రిద్దిటోరో, కె.నైనా, వంశిక, అండర్-17 విభాగంలో జి.వర్శిక, ఎస్. తనిష్క, ఎం.దాస్, మిద్ది శాంతి జ్యోతి, అండర్-19 విభాగంలో టి.సాయిసుదీక్ష, కె. రిషికాతులసి, ఎం. మాం డవ లినేషియా, ఎం.దర్శిక ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సమసమాజ స్థాపనకు గద్దర్ అలుపెరగని కృషి

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

హుజూరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు ప్రజా యుద్ధనౌక గద్దర్ అలు పెరగని కృషిచేశారని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ లో శనిగరం బాబ్జీ ఆధ్వర్యంలో గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సిటీ సెంట్రల్‌హాల్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ తెలంగాణ ప్రాంత ప్రజల విముక్తి కోసం తూటాను మోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. గద్దర్ ఆశ, ఆశయం సమ సమాజ నిర్మాణం స్వేచ్ఛ, సమానత్వం పోరా టాలు చేశారన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ విద్యార్థి నుంచి జన నాట్య మండలి సాంస్కృతిక సేనానిగా పాటను ఆయుధంగా ఎక్కుపెట్టి ప్రజా ఉద్యమాలు జరిపారన్నారు. కారంచేడు హత్యాకాండ జరిగిన ప్పుడు దళితులకు ధిక్కారం నూరిపోశారన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపి న గద్దర్‌ను 75ఏళ్ల వయసు వర కు 32 పోలీసు కేసులు వెంటాడా యన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమా న్ని గద్దర్ తన పాటా, ఆటలతో ఉర్రూతలూగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిత్యం ప్రజాపోరా టాలతో ముందుకు సాగిన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభలో కళాకారులు పాడిన పాటలు ఆహూ తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఆవునూరి సమ్మయ్య, ముక్కెర రాజు, జీడీ సార య్య, బండ శ్రీనివాస్, మురళీ మధు, రాములు, తిరుపతయ్య, కళాకారులు, కవులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం..

వీర్నపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వీర్నపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో రైతు పెంచ్యాల నర్సింగం ఆయిల్‌పామ్ పంట మొద టి దిగుబడి రావడంతో అధికారులు, రైతులు శుక్రవారం పరిశీ లించారు. జిల్లాలోనే మొదటిసారి ఆయిల్‌పామ్ పంట కోతకు వచ్చిం దన్నారు. మొద టిదశలో సుమారు 4 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చినట్లు ఏఈవో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక ఎదుగుదల అధిక మవుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో టన్నుకు రూ.18,500 ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి పవన్, ఏఎంసీ డైరెక్టర్లు చంద్రమౌళి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,062 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 5,062 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో కాకతీయ కాలువకు 2,350 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 113 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 240 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 112 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 225 క్యూసెక్కులు, వరద కాలువకు 2,250 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 462 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వ్యయం అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 4.343 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నోరూరిస్తున్న పిండి వంటలు..

వరుస పండుగలు... శుభకార్యాలు తయారీదారులకు పెరిగిన గిరాకీ





అమ్మకానికి సిద్ధంగా ఉన్న గారెలు, మురుకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఈ ఆగస్టు మాసంలో వరుసగా పండు గలతో పాటు (వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి) శుభకార్యాల జోరు ఊపందుకుంది. ఇందు కు ఎన్ని పదార్థాలు వడ్డించినా పిండి వంటలు రుచి చూపా ల్సిందే! పిల్లలు, పెద్దలు సైతం తినుబండారాలకు దాసులే! పిల్లలకైతే స్నాక్స్ రూపంలో కూడా ఉపయోగపడుతాయి. ఇతర ప్రదేశాలకు టూర్ వెళ్లే వారికి కూడా బాగా పనికి వస్తాయి. దీనికి జిల్లా వాసులు శ్రమ లేకుండా పలు షాపుల్లో, హోం ఫుడ్ సెంటర్లలో తయారైన పిండి వంటలను, పలు పచ్చళ్లను ఆశ్రయిస్తున్నారు. అందు బాటులో ధరలకే వంటకాలను అందిస్తుం డటంతో అటు తయారీ దారులకు గిరాకీ పెరుగుతోంది. చేయి తిరిగిన మనుషులతో శుభ్రమైన పదార్థాలు ఏ రోజుకారోజు తయా రీ చేసి విక్రయిస్తున్నారు. మరో వైపు విదేశా ల్లో ఉన్న తమ వారికి ప్యాకింగ్ చేసి కూడా పంపుతు న్నారు. సుమారు 50కి పైగా తీయని, కారపు వంట కాలు అమ్ము తుండగా వినియోగదారులు కిలోల చొప్పున తీసుకుంటున్నా రు. చిప్స్ మొదలు అప్పాల వరకు, గవ్వలు మొదలు లడ్డూల వరకు వివిధ సైజుల్లో అమ్ముతున్నారు. వెరైటీని బట్టి కిలోకు ఒక్కో పిండి వంటకం కనిష్ట ధర రూ.280 నుంచి గరిష్ట ధర రూ.350 వరకు పలుకుతున్నాయి.

ఉధృతంగా పల్వంచ వాగు

గంభీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంభీ రావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వస్తోంది. మానేరు జలాశయం నీటి మట్టం రోజు రోజుకు పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఎగువ మానేరు నీటి మట్టం 23 ఫీట్లకు చేరింది. మానేరు పూర్తిగా నిండేం దుకు మరో 8 ఫీట్ల నీరు కావల్సింది ఉంది. మానేరు నిండుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



ఈఎంఆర్ఎస్‌లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాల లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పలువురు విద్యార్థినులు జ్వరాలతో బాధపడుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సారియాఅంజుమ్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది శుక్రవారం శిబిరం ఏర్పాటు చేశారు. 63 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. నలుగురు విద్యార్థినుల రక్త నమూనాలను సేకరించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప, హెల్త్ అసిస్టెంట్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ శుక్రవారం సిట్ ఎదుట హాజరు కానున్న నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. నాయకులు రామచంద్రారెడ్డి, గణేశ్, కిరణ్‌నాయక్, రాజిరెడ్డి, రమేశ్ తదితరులు ఉన్నారు.

బాధితులకు పరామర్శ

గంభీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పలువురిని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి తల్లి లక్ష్మి మృతిచెందగా, వారి ఇంటికి వెళ్లి రవీందర్‌రావు పరామర్శించారు. అదే విధంగా దైత రాములు భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు పెద్దవేణి వెంకటి, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి. నాయకులు మహేష్, రాజు తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ రేషన్ కార్డుల పంపిణీ


రేషన్‌కార్డుల ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న నాయకులు

బోయినిపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలలో ఇంటింటికీ రేషన్‌కార్డుల పంపిణీని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం, మాజీ ఎంపీటీసీ పిట్టల రమేష్ తదితరులు ఉన్నారు.

మామిడిపల్లిలో వైద్య శిబిరం

కోనరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మామిడిపల్లిలో మండల వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి టీబీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరము, దగ్గు, నీరసం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. నిర్ధారణ అయినవారికి ఆరు నెలలు ప్రభుత్వం తమ ఖాతాలో పౌష్టికాహారం నిమిత్తం వెయ్యి రూపాయలు జమ చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రషీద్, వరమ్మ, జ్యోతి, సుజాత, రమణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


నాగారంలో సతీష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

కోనరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : దాసరి నారాయణరావు యువ ప్రతిభశాలి అవార్డు పొందిన మాసం సతీష్‌ను గ్రామస్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన మాసం సతీష్‌కు కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' సినిమా ఈ ఏడాదిలో నిర్వహించిన దాసరి నారాయణరావు ఫిలిం అవార్డుకు ఎంపికై బెస్ట్ సినిమాటోగ్రఫీ కేటగిరిలో అవార్డు సాధించడం పట్ల సతీష్‌ను ఘనంగా సన్మానించారు.

యాదవుల హక్కుల కోసం పోరాటం

కథలాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : యాదవుల హక్కుల కోసం నిరంతరం పోరాటం సాగిస్తామని జిల్లా యాదవ సంఘం అడహక్ కమిటీ అధ్యక్షుడు గనవేని మల్లేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాండ్ర్యాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో యాదవ జనాభా దామాషా ప్రకారం తమకు దక్కాల్సిన వాటా కోసం ఐక్యంగా పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. సంఘాల బలోపేతం, యాదవులకు దక్కాల్సిన హక్కుల కోసం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో 101 మంది సంఘంలో సభ్యత్వం పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు జెల్ల వేణు, బొడ్డు బాలు, అరికంటి సాగర్, బర్ల మధు, జంగ రంజిత్ సహా సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కథలాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మీ వ్రతాలు చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. భూషణరావుపేట మర్రవ్వ ఆలయంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయాలు మహిళలు, చిన్నారులతో సందడిగా కనిపించాయి.

ఇరువర్గాల పరస్పర దాడి..

చందుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు అడ్డంగా వేసిన బండరాళ్ల తొలగించాలనే విషయంలో ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటన చందుర్తి మండలం తిమ్మా పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొలకాని సురేష్ ఇంటి సమీపంలో రాజు అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి సంబంధించిన బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా వేశాడు. కట్రాయి తీయాలని రాజుకు చెప్పినా పట్టించుకోవడం లేదు. శుక్రారం సురేష్ ఆటోకు బండ రాళ్ల తగలడంతో గొడవకు దారి తీసింది. దీంతో ఇరువర్గాలు దాడి చేసుకున్నారు. దాడి సంఘటనలో సురేష్ తలకు తీవ్ర గాయం అయ్యింది. పోలీసులు చికిత్స నిమిత్తం సురేష్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు





సిరిసిల్ల శ్రీ కృష్ణవేణి హైస్కూల్, ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్, గంభీరావుపేటలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రాఖీలు కడుతున్న విద్యార్థులు, ఇల్లంతకుంటలో కాంగ్రెస్ నాయకులకు రాఖీలు కడుతున్న మహిళలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాఠశాలలో ముందస్తుగా రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరగాయి. శుక్రవారం స్థానిక శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ఇంగ్లీష్ యూనియన్, మహాత్మా గ్రామర్ హైస్కూల్, సెలెస్టియల్ హైస్కూల్, శుభోదయ హై స్కూల్, తక్షశిల హైస్కూల్, విజ్ఞాన్ హై స్కూల్‌లో విదార్థినీలు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. రక్ష బంధాన్ని ప్రతిబింబించే విధంగా విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు రాఖీ పండగను నిర్వహించారు. ముందస్తు రాఖీ పండగలో బాగంగా విదార్థులకు విద్యార్థినులు రాఖీ కట్టి పండగ ప్రత్యేకతను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినీలు ఉన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు రాఖీ పండగ వేడుకలలో భాగంగా ఎస్ఐ లక్ష్మణ్‌తో పాటు సిబ్బందికి మహిళ కానిస్టేబుల్ స్వప్న శుక్రవారం రాఖీలు కట్టి సంబరాలు జరుపుకున్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బ్రహ్మకుమారి సువర్ణ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్‌కు, సిబ్బందికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులకు మహిళలు, ఏబీవీపీ ఆధ్వర్యంలో పొత్తూరు గ్రామంలోని వివేకానంద పాఠశాల, ఇల్లంతకుంటలోని కేరళమాడల్, శ్రీవాణి తదితర పాఠశాలలో శుక్రవారం రాఖీ సంబరాలు జరిగాయి. ఈసందర్భంగా రాఖీ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తీగల పుష్పలత, ఏబీవీపీ నాయకులు అక్కెం నాగరాజు, గుంటి మహేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రేమానుబంధానికి ప్రతీక..

(5వ పేజీ తరువాయి)

గురుదేవ్, రవీంద్రనాథ్‌ఠాగూర్ తన శాంతినికేతన్‌లో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జంధ్యాల పూర్ణిమ..

శ్రావణ పూర్ణిమనే జంధ్యాల పూర్ణిమ(నూలు పౌర్ణమి)గా జరుపుకుంటారు. యజ్ఞోపవీతాన్ని శ్రావణ పూర్ణిమ రోజు మార్చుకుంటారు. సంవత్సరం మధ్యలో మార్చుకోవల్సిన అవసరం ఉన్నా శ్రావణ పూర్ణిమ నాడు విధిగా నూతన ధారణ చేస్తారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు వారి క్షేమాన్ని కోరుతూ రక్షగా రాఖీ కట్టే పండుగను జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. శ్రావణ పూర్ణిమ రోజు రక్ష కట్టి వారు కోరిన వరాలను పొందే పవిత్ర దినంగా కూడా జరుపుకుంటారు. ఇదే సందర్భంలో ఉపనయం అయిన బ్రహ్మణ, వైశ్య, పద్మశాలీ ఇతర కులాల వారు యజ్ఞోపవీతాలను మార్చుకుంటారు. పాత వాటి స్థానంలో కొత్తవి ధరిస్తారు. నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు మార్కండేయ స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఎవరెవరికి ఎన్ని పోగులు...

యజ్ఞోపవీత ధారణ ఎంతో గొప్పగా భావిస్తారు. వివాహం కాని వధువులకు యజ్ఞోపవీత ఒక పోగు చాలు. గృహస్తులకు, విదురులకు మూడు పోగులు చాలు, కొందరు ఐదు పోగులు ధరిస్తారు. యజ్ఞోపవీతం మూడు భాగాలుగా తయారు చేస్తారు. ఇందులో ఒకొక్క ముడిలో మూడు ధారాలతో మొత్తం తొమ్మిది ధారాలు ఉంటాయి. 96 బెత్తల పొడవు ఉంటుంది. ఒక్కొక్క ధారం వెనుక ఒక్కొక్క నేపథ్యం ఉంది. మొదటి పోగు ధారం ఓంకారం, బ్రహ్మకు నిలయంగా ఉంటే, రెండవ పోగు తేజస్సు, అగ్ని, మూడవ పోగు అనంతునికి, నాలుగవ పోగు చంద్రునికి, చల్లాని కాంతినిచ్చేదిగా, ఐదవ పోగు ప్రజాపతికి, ఆరవ పోగు పాలించే స్వభావం, ఏడవ పోగు వాయుదేవుడు, శుభ్రత, ఎనిమిదవ పోగు సూర్య నిలయం, ప్రతాపం, తొమ్మిదవ పోగు అందరు దేవతలు సమదృష్టిని ఇచ్చేదిగా ఉంటుందని వేదాలు చెబుతున్నాయి. అందుకే యజ్ఞోపవితాన్ని శ్రావణ పూర్ణిమ రోజు మార్చుకోవడం సనాతనంగా వస్తుంది. భారతీయ ధర్మ నిర్మాణ వ్యవస్థలో యజ్ఞోపవీతం లేనిదే ఏ ఇంట్లో కూడా శుభకార్యాలు, పూజలు జరుపుకోరు. కాగా, నూతన యజ్ఞోపవీతం ధరించిన తరువాత పాత యజ్ఞోపవీతాన్ని ఏ విధంగా ధరిస్తారో అదే విధంగా అంటే, శిరస్సు నుంచి మాత్రమే విసిర్జించాలి. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు వారి క్షేమాన్ని కోరుతూ రక్షగా రాఖీ కట్టే పండుగను జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. శ్రావణ పూర్ణిమ రోజు రక్ష కట్టి వారు కోరిన వరాలను పొందే పవిత్ర దినంగా కూడా జరుపుకుంటారు. ఇదేసందర్భంలో ఉపనయం అయిన బ్రహ్మణ, వైశ్యపద్మశాలీ ఇతర కులాలవారు యజ్ఞోపవీతాలను మార్చుకుంటారు. పాతవాటి స్థానంలో కొత్తవి ధరిస్తారు. కొత్తగా ఉపనయం పొందుతారు. పద్మశాలీలు ఉదయమే జంధ్యాలను మార్చుకొని సాయంత్రం వేళ మార్కండేయ స్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తారు.ఎడ్లబండిపై లేదా ట్రాక్టర్‌పై మగ్గాన్ని నిలిపి వస్త్రాన్ని నేస్తూ పట్టణ వీధుల్లో రథాన్ని నడిపిస్తారు. రథోత్సవంలో నేసిన వస్త్రాన్ని మార్కండేయునికి సమర్పించుకుంటారు. జంధ్యాల పూర్ణిమను నూలు పూర్ణిమగా కూడా జరుపుకుంటారు.


జంధ్యాలు

ప్రేమను పెంచుతుంది..

- బుస్స అక్షర



మనుషుల్లో రాఖీ పండుగ ప్రేమను పెంచుతుంది. ఆప్యాయత మమతను పరిమళింపచేయడం కోసం ఈ రక్షా బంధనం రక్త సంబంధీకుల మధ్య ఆనందాన్ని నింపుతుంది.

రక్షాబంధన్ ధైర్యాన్నిస్తుంది..

- బి దివ్య



మహిళలకు ఆధ్యాత్మికంగా నోములు, వ్రతాలకు శ్రావణ మాసం ముఖ్యమైంది. రక్షా బంధన్ తోబుట్టువులు అండగా ఉన్నారనే ధైర్యాన్నిస్తుంది. సోదరులకు రక్ష కట్టి ఎప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి సోదరి కోరుకుంటుంది.

సోదరులకు శుభం కలగాలని..

- తమ్మిశెట్టి సారిక



రాఖీ పండుగతో సోదరులకు శుభం కలుగాలని కోరుకుంటాం. రక్తబంధానికి ఇది ప్రతీకగా నిలుస్తుంది. ఆయురారోగ్యాలను, పెంచడమే కాకుండా కుటుంబ సభ్యులందరు ఒకచోట చేరుకోవడానికి ఎంతో దోహద పడుతుంది.

వైభవంగా వరలక్ష్మీ వ్రతం..

సిరిసిల్ల ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి, శ్రీరాజరాజేశ్వర స్వామి, అంబభవానీ దేవస్థానాలతో పాటు ఆంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం ఘనంగా వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల తోపాటు శ్రీ వాసవీ పారాయణం, లలిత సహస్రనామార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సిరిసిల్లలోని వివిధ పాఠశాలల్లో కూడా సరస్వతి పూజలు నిర్వహించారు. ప్రతి ఇంట్లో వరలక్ష్మి వ్రతం కోసం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో వ్రతాలు నిర్వహించారు.


సిరిసిల్లలో వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజలు


సుద్దాలలో..


రుద్రంగిలో..

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు భక్తిప్రపత్తుల వరలక్ష్మీ వ్రతాలు చేసుకున్నారు మండలంలోని వివిధ గ్రామాలలోని ఆలయాల్లో శుక్రవారం భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అష్ట ఐశ్వర్యాలకు ప్రతీక అయిన లక్ష్మీదేవిని పూలు, పండ్లతో అలంకరించారు. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు.

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను జరిపించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం మహిళలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మంగళగిరి లక్ష్మయ్య, శ్రీనివాస్, చక్రపాణి తదితరులు ఉన్నారు.

రుద్రంగి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలకేంద్రంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా సాగింది. ప్రతి ఇంటిలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో కొలిచారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

బైక్ స్టాండ్ కాదు.. బస్ షెల్టర్..


బస్ షెల్టర్‌లో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు

ఎల్లారెడ్డిపేట, ఆగసు8(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిస్తోంది బైక్ స్టాండ్ అనుకుంటున్నారా..? కాదు.. పల్లె ప్రజలు తమ ప్రయాణాన్ని సాగించేందుకు ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణీకుల కోసం సంబంధిత శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బస్ షెల్టర్. ప్రయాణీకులకు నీడ, కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బస్టాప్‌లో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను ఇలా నిలిపిఉంచారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న బస్టాప్ బైక్‌లో నిండిపోయింది. దాంతో స్థలం లేక ప్రయాణీకులు రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బస్టాప్‌లో బైక్‌లు నిలిపి ఉంచకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి


అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు


వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైన శ్రావణ శుక్రవారం సౌభాగ్యాన్ని అందించాలని మహిళలు నోములు, వ్రతాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అష్టైశ్వరాలు, సిరిసందలను మెండుగా ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం సందడిగా మారింది. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించేందుకు మహిళలు క్యూ లైన్‌లో నిరీక్షించారు. అమ్మవారికి నూతన వస్త్రాలతో ఒడిబియ్యం సమర్పించారు. అనం తరం తులసీమాతకు పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, కనుముతో ఒక్కరికి ఒక్కరు వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమానికి ఈవో రాధాబాయి హాజరయ్యారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందు కు ఉద్యోగులను అప్రమత్తం చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు..

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి ఉదయం సాయంత్రం చతుష్షష్టి ఉపచారాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మహాలక్ష్మీ అమ్మవారికి షోడశోపచార పూజలు ఘనంగా నిర్వహించారు.